ప్రజాశక్తి

మంగళవారం 22 నవంబర్ 2022 8 పేజీలు

గుంటూరు పల్నాడు

సంపద సృష్టించే వారికే సంక్షోభం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతులకు ఇబ్బందులు
- కౌలు రైతుల గుర్తింపులో నిర్లక్ష్యం
- కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు
- కౌతురైతు సంఘం రాష్ట్ర తృతీయ మహాసభ ప్రారంభం సందర్భంగా ర్యాలీ, బహిరంగ సభ

బహిరంగ సభలో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి/ చిలకలూరిపేట/పల్నాడు జిల్లా

దేశంలో సంపద సృష్టించే వారికి ప్రభుత్వాలు సంక్షోభాన్ని మిగుల్చుతున్నాయని కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు అన్నారు. కౌలురైతు సంఘం రాష్ట్ర తృతీయ మహాసభ సందర్భంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టనంలోని కళామందిర్ సెంటర్లో తేళ్ల ఆదినారాయణ వేదికపై సోమవారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అధ్యక్షత ▶ 2లో

కౌలు రైతులను సంఘటితం చేయండి

- సిసిఆర్‌సికి నిబంధనలు మార్చాలి
- పోరాటాలకు పిడిఎఫ్ మద్దతు
- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

చేబ్రోలు భాస్కరరావు, తేళ్ల ఆదినారాయణ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పల్నాడుజిల్లా, చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 2019 కౌలురైతు చట్టంతో తీవ్ర నష్టం జరుగుతోందని, భూ యజమాని ఒప్పంద సంతకం నిబంధన ఎత్తివేసి సిసిఆర్‌సిలు జారీ చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం తృతీయ రాష్ట్ర మహాసభ పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో సోమవారం ప్రారంభమైంది. చేబ్రోలు భాస్కరరావు నగర్ (గ్రాండ్ వెంకటేష్ కళ్యాణ మండపం)లో నిర్వహించిన ప్రారంభ సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించగా, ▶ 2లో

ఘటనా స్థలిలో తల్లీకూతుళ్ల మృతదేహాల వద్ద వెంకటేశ్వర్లు, అతని కుమార్తె తేజస్విని

టిప్పర్ ఢీకొని తల్లీకూతుళ్లు దుర్మరణం

వలస కూలీల ఇంట విషాదం

ప్రజాశక్తి - మేడికొండూరు

పొట్టకూటి కోసం ఊరుగాని ఊరొచ్చిందా నిరుపేద కుటుంబం. బంధువుల ఇంట శుభ కార్యానికి వెళ్లి సంతోషంగా గడిపిన ఆ ఆనంద క్షణాలను గుర్తు చేసుకుంటూ తిరు పయనమయ్యారు. కొద్ది సేపటికి ఇంటికి చేరతామనగా ప్రమాదం లారీ రూపంలో వెంటాడింది. వారి సంతోషాన్ని మృత్యువు కబళించింది. అమ్మా మాట్లాడు.. చెల్లీ మాట్లాడు... అంటూ మృతదేహాల మీద పడి చిన్నారి పెట్టిన రోధన అందరి కంట్లోకీ నీరు తెచ్చింది. మండలంలోని పేరేచర్లలో నరసరావుపేట రోడ్డులోని బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్ సమీపంలో సోమవారం జరిగిన హృదయవిదారక ఘటనపై వివరాల ప్రకారం..

ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన వేల్పుల వెంకటేశ్వర్లు, లక్ష్మి (35) దంపతులది కడుబీద కుటుంబం. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి వీరిది. తమ సొంతూళ్లో పనుల్లేకపోవడంతో గుంటూరులోని చుట్టగుంట సమీపంలోని కొత్త కాలనీకి కొద్ది నెలల కిందట తమ ఇద్దరు కుమార్తెలైన తేజస్విని, నాగమల్లీశ్వరి (4)ని తీసుకుని వచ్చారు. దంపతులిద్దరూ మిర్చి యార్డులో చిన్నచిన్న కూలిపనులు చేసుకుంటూ తమ పిల్లల్ని చదివించుకుంటున్నారు. ఈ క్రమంలో పల్నాడు జిల్లా కారంపూడి మండలం, ఒప్పిచర్లలోని తమ బంధువుల ఇంట శుభకార్యానికి ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండి సోమవారం ఉదయం గుంటూరుకు తిరుగు పయనమయ్యారు. మరో 20 నిముషాల్లో ఇంటికి చేరుకుంటారనగా మధ్యాహ్నం 12 ▶ 2లో

ఫొటోలు మార్చి అక్రమంగా రుణం

ప్రజాశక్తి - తాడికొండ

పాస్‌పుస్తకంలో ఫొటో మార్పుచేసి రూ.9 లక్షల లోను అక్రమంగా తీసుకున్న ఘటనపై బాధితురాలు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై సిఐ జి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నెకల్లుకు చెందిన దామినేని ఇందిరా దేవికి పొన్నెకల్లులోని డి.నంబర్ 467/1లో 6.2 ఎరాలు, డి..నంబర్ 468లో 1.8 ఎకరాలు, మొత్తం 7.10 ఎకరాల భూమి ఉంది. ఈమె కొంతకాలంగా గుంటూరు నగరం ఎస్‌విఎన్ కాలనీలో నివాసం ఉంటుండగా కుమారుడు అమెరికాలో ఉంటున్నారు. కుమారుణ్ణి చూడ్డానికని 2020 ఫిబ్రవరిలో అమెరికా వెళ్లిన ఇందిరాదేవి 2021 ఫిబ్రవరిలో తిరిగి వచ్చారు. అనంతరం ఆమె పొలంపై నిడుముక్కలలోని కార్పొరేషన్ బ్యాంకులో లోను ఉన్నట్లు కౌలుదారు తెలిపాడు. దీంతో ఇందిరా దేవి బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఆమె పొలానికి నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించి 2020 జూన్ 26న రూ.9 లక్ష రుణం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. తనకేమీ తెలీదని ఇందిరాదేవి తెలపగా పత్రాలను అధికారులు చూపించారు. పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డులో ఫొటోలు మార్పు చేసి రుణం తీసుకున్నట్లు నిర్ధారించుకుని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

26న యువజనోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

హాజరు కానున్న రాష్ట్ర మంత్రి రోజా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరు కన్వెన్షన్ హాలులో 26న యువజనోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని స్టెప్ సిఇఒ వెంకటనారాయణను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లపై కలకరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం సమీక్షించారు. ఉత్సవాల్లో రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, ▶ 2లో

దీక్షలను ప్రారంభిస్తున్న పాశం రామారావు

నిర్లక్ష్యం వీడకుంటే జిల్లావ్యాప్త ఉద్యమం

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- 3వ రోజుకు రాజధాని పారిశుధ్య కార్మికుల రిలే దీక్షలు
- మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి విన్నవిస్తామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సంఘీభావం

2 లో

నవజాత శిశువు మృతిపై అనుమానాలు 2లో

నవజాత శిశువు మృతిపై అనుమానాలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని నెహ్రూ నగర్‌లో నవజాత శిశువు మృతిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. స్థానికురాలైన యువతి తల్లిదండ్రులు మరణించడంతో అమ్మమ్మ వద్ద పెరుగుతోంది. అయితే ఆమెకు వివాహం కాకుండానే గర్భం దాల్చింది. ఈ క్రమంలో ఆదివారం నొప్పులు రావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో గుంటూరుకు వెళ్లడానికి సిద్ధమవడానికని ఇంటికి వెళ్లారు. అయితే ఇంట్లోని బాత్‌రూమ్‌కు వెళ్లిన సందర్భంలో కాన్పు అయినట్లు తెలిసింది. బాత్‌రూమ్ నుండి మురుగు కాల్వలోకి వచ్చిన రక్తాన్ని గమనించిన స్థానికులు సచివాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎఎన్‌ఎం, మహిళా పోలీసు అక్కడికి వచ్చి చూడగా బక్కెట్‌లో నవజాత శిశువు కనిపించింది. వెంటనే వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చి, యువతిని, నవజాత శిశువును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే శిశువు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే శిశువును యువతి బక్కెట్‌లో వేసినట్లు ప్రాథమికి విచారణలో తెలిపిందని పోలీసులు పేర్కొంటున్నారు. శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి విచారణ ఉంటుందని సిఐ బాలకృష్ణ తెలిపారు.

టిప్పర్ ఢీకొని తల్లీకూతుళ్లు దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

గంటలకు పేరేచర్లలో నరసరావుపేట రోడ్డులో బ్రిడ్జి వద్ద వెనక నుండి లారీ వచ్చి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపైనున్న లక్ష్మి, ఆమె కుమార్తె నాగమల్లీశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా వెంకటేశ్వర్లు, మరో కుమార్తె తేజస్విని స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తల్లి, చెల్లి ఇద్దరూ మృతి చెందారని గ్రహించలేని ఎనిమిదేళ్ల మల్లీశ్వరి వారి మృతదేహాల వద్ద 'లేగవండి..' అంటూ రోధించడం అందర్నీ కంటతడి పెట్టించింది. టిప్పర్ లారీలో క్లీనర్ లేకపోవడం వలన ఎడమవైపు వైపు వచ్చే వాహనాలు డ్రైవర్ గుర్తించలేకపోవడం వల్ల ఈ ప్రమాదం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు. టిప్పర్ డ్రైవర్ పోలీసులకు లొంగిపోగా మృతదేహాలను పోలీసులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

నిర్లక్ష్యం వీడకుంటే జిల్లావ్యాప్త ఉద్యమం

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- 3వ రోజుకు రాజధాని పారిశుధ్య కార్మికుల రిలే దీక్షలు
- మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి విన్నవిస్తామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సంఘీభావం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు హెచ్చరించారు. పెండింగ్ జీతాల చెల్లింపు, పని భద్రత, ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకావాలనే తదితర డిమాండ్లతో తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు మూడో రోజుకు చేరాయి. సోమవారం దీక్షలను ప్రారంభించిన రామారావు మాట్లాడుతూ కరోనా కాలంలోనూ ప్రాణాలకు తెగించి పని చేసిన పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించక పోవడం దారుణమన్నారు. కరోనా కాలంలో నష్టాల సాకుతో పారిశ్రామిక వేత్తలు, కార్పోరేట్‌లకు రూ.5 లక్షల కోట్ల రుణాలు పాలకులు రద్దు చేశారని, కష్టపడి పనిచేసే పారిశుధ్య కార్మికులకు మాత్రం జీతాలు సరిగా ఇవ్వడం లేదని అన్నారు. సంక్షేమ పథకాల కోసమంటూ కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్ దగ్గర అప్పులు తెచ్చే పాలకులు రాజధానిలోని 325 మంది కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నారా? అని ప్రశ్నించారు. జీతాలడిగితే.. వచ్చే ఏడాది జనవరి తర్వాత పారిశుధ్య కార్మికులు ఉంటారో? ఉండరో? అని మాట్లాడటం దారుణమన్నారు. పారిశుధ్య కార్మికులు లేకుంటే ఊళ్లన్ని కంపు కొడతాయని హెచ్చరించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాల్సి ఉన్నా రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని, వాటినీ సరింగా చెల్లించడం లేదని విమర్శించారు. కార్మికుల ఉద్యమానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఉటుందని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, సిపిఎం నాయకులు పి.బాబూరావు, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు జ్యోతి, మరియమ్మ, మల్లీశ్వరి, వెంకటరమణ, దుర్గ, నాగేశ్వరరావు, శ్రీలత పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సందర్శించి మద్దతు తెలిపారు. పెండింగ్ జీతాల చెల్లింపు, పని భద్రత, ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చడం లాంటి న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరికాదన్నారు. రాజధాని ప్రాంత 29 గ్రామాల పారిశుధ్య కార్మికులు సిఆర్‌డిఎ పరిధిలో ఉన్నందున సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌ను కలిసి మాట్లాడతానని చెప్పారు. కొంతమంది పారిశుధ్య కార్మికులను వెంట బెట్టుకొని మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మిని కలిసి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్మికుల ఆందోళనలకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల నుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు

ఘనంగా కౌలు రైతు మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి-చిలకలూరిపేట/పల్నాడు జిల్లా

కౌలు రైతు సంఘం రాష్ట్ర తతీయ మహాసభలు చిలకలూరిపేట పట్టణంలోని గ్రాండ్ వెంకటేష్ కళ్యాణ మండపంలో సోమవారం ప్రారంభం అయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభల ప్రారంభ సూచికగా పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు కే.రామారావు జెండా ఆవిష్కరించారు. సభ వద్ద ఏర్పాటుచేసిన స్థూపానికి సభ్యులందరూ నివాళి అర్పించారు. మహాసభకు కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు సభా పరిచయం చేశారు. అమరవీరులు తేళ్ల ఆదినారాయణ, చేబ్రోలు భాస్కరరావు, పోపూరి శివరామయ్య చిత్రపటాలకు ఏఐకేఎస్ జాతీయ సహాయ కార్యదర్శి విజూ కష్ణ న్, ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, హరిబాబు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు మానుకొండ ఉపేంద్ర తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాదులుకొండ ఉపేంద్ర, అధ్యక్ష కార్యదర్శులు వై . రాధాకష్ణలు, సిఐటియు జిల్లా నాయకులు గుంటూరు విజయకుమార్, ముజఫర్ అహ్మద్ ప్రసంగించారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చిలకలూరిపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, పల్నాడు జిల్లా అధ్యక్షులు దుగ్గి నాగేశ్వరరావు, పెద్దిరాజుల ఆధ్వర్యంలో డప్పు కళాకారులతో ప్రదర్శన నిర్వహించారు.

సభలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ

కౌలు రైతు సంఘం నాయకులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో హాజరై ఏపీ కేఆర్ఎస్ జెండాలను చేతబడి 2019 కవులు రైతు చట్టం రద్దుచేసి, ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేశారు. గ్రాండ్ వెంకటేష్ కళ్యాణ మండపం నుంచి బయలుదేరిన కౌలు రైతుల ర్యాలీ ఎన్నార్టీ సెంటర్ మీదుగా చౌత్ర సెంటర్, గడియార స్తంభం సెంటర్, మీదగా కళామందిర్ సెంటర్ వద్ద బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకున్నారు.

కౌలు రైతులను సంఘటితం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

మహాసభకు అధ్యక్షవర్గంగా వై.రాధాకృష్ణ, వి.బాలకోటయ్య, లక్ష్మీశైలజ వ్యవహరించారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డు పొందిన ప్రతిఒక్కరికీ రుణాలు దక్కేలా కౌల్దార్లను సంఘటితం చేసి సంఘం పోరాడాలని చెప్పారు. వ్యవసాయం అంటే కౌలు రైతులేనని, కృష్ణా, గుంటూరు, పల్నాడు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో కౌలు రైతులే అధికంగా వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. రాయలసీమ జిల్లాలోనూ 60 శాతం కౌలు రైతులే వ్యవసాయ సాగు చేస్తున్నారని వివరించారు. అయితే కౌల్దార్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, రాధాకృష్ణన్, స్వామినాథన్ కమిషన్ల సిఫార్సులు అమలుకు నోచలేదని అన్నారు. 2011లో సుమారు మూడు లక్షల మంది కౌలు రైతులకు ఎల్‌ఇసి కార్డులు, రుణాలు ఇచ్చారని గుర్తు చేశారు. కౌలురైతులను ఆదుకుంటానని పాదయాత్రలో హామీనిచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో తెచ్చిన కౌలు రైతుల చట్టం తీవ్రంగా నష్టం చేసిందని విమర్శించారు. కౌల్దార్లకు పంట రుణాలివ్వాలనే అంశాన్నీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. పెట్టుబడులకు అప్పులు తెచ్చిన కౌలార్లు పంటకు మద్దతు ధరల్లేక, అకాల వర్షాలు, వైరస్‌లతో నష్ట పోతున్నారని, ప్రభుత్వాలు ఆదుకోపోవడంతో అనేకమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పల్నాడు జిల్లాలో ఒక ఏడాదిలోనే 30 మంది కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. కౌలురైతు చట్టంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రాయితీలు కల్పించిన విధంగా ఓసీ కౌలు రైతులకూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులకు రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ, పంట బీమా అందడం లేదని, ఇందుకు ఈ-క్రాప్ లేకపోవటం కారణమని చెప్పారు. ఈ సమస్యలపై చేసే పోరాటాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీల పూర్తి సహకారం ఉంటుందని ప్రకటించారు. సభలో కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు, న్యాయవాది మానుకొండ ఉపేంద్ర, సిఐటియు నాయకులు జి.విజయకుమార్, బి.శంకరరావు పాల్గొన్నారు.

26న యువజనోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్‌కె రోజా పాల్గొంటున్నందున కార్యక్రమాలు చక్కగా నిర్వహించి విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని యువజన సంక్షేమ ఖాధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం యువజన సంక్షేమ శాఖ స్టెప్ స్వశక్తి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను జెసి జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంపద సృష్టించే వారికే సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

వహించగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పంటలను ఉత్పత్తి చేసి దేశానికి సంపదను అందిస్తున్న రైతులు, కౌలు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని, రుణాల ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు రావడం లేదని చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు ఉదారంగా రుణాలు ఇస్తున్న బ్యాంకర్లు వాస్తవ సాగు దారులకు రుణాలు ఎందుకు ఇవ్వవని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిల వల్ల సిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు సంక్షోభంలో ఉన్నాయని, ప్రభుత్వ విధానాల వల్ల మిల్లులు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వెలిబుచ్చారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో మిల్లులపై రూ.2 కోట్ల భారం మోపారని అన్నారు. సహకార చెక్కెర కర్మాగారాలు సక్రమంగా నడవటం లేదన్నారు. యడవల్లిలో 1975లో అప్పటి ప్రభుత్వం 460 ఎకరాల్లో ఏకపట్టాగా దళితులు,బిసిలకు భూములు ఇవ్వగా గ్రానైట్ నిక్షేపాలు ఉన్నాయని వైసిపి ప్రభుత్వం రైతులకు వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. పాదయాత్ర సమయంలో జగన్ యడవల్లి రైతులకు ఇచ్చిన హామీ ఏమైందన్నారు. మంత్రి విడదల రజనీ రైతులకు మేలు చేయాలే కానీ కీడు చేయరాదన్నారు. ఎసైన్‌మెంట్ భూములను లాక్కోవడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతోందని, దీన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకోవాలని, సిసిఆర్ కార్డు చట్టాన్ని సవరించాలని, కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని, ఆత్మహత్యలు చేసుకున్న ప్రతి రైతు కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని, కౌలు, ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గించాలని, ఓసి కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని, కేరళ తరహాలో పంటలకు మద్దతు ధరలు ఇవ్వాలని, భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రలో కౌలు రైతులను అన్ని విధాల ఆదుకుంటానని అధికారం రాగానే కొత్త చట్టం తీసుకువచ్చి కౌలు రైతులను నడ్డి విరిచారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించారు. కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని, ప్రశ్నించిన వారిని నోరు ఎత్తకుండా అణచి వేస్తున్నారని అన్నారు. పనిచేసిన వారికి డబ్బు చెల్లించకుండా ప్రశ్నిస్తే ఉద్యోగాల్లోని తొలగిస్తామని బెదిరించడం దుర్మార్గమన్నారు. భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి వారి సంక్షేమ నిధిని కాచేశాడని విమర్శించారు. ప్రజలపై చెత్త పన్ను విధించి, అనేక పన్నులతో రాష్ట్ర ప్రభుత్వం వేధిస్తోందని ఎద్దేవా చేశారు.

రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ కరోనా మహమ్మారి సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల విలువ తెలిసిందన్నారు. పంట సాగు చేసి ఉత్పత్తులను పెంచడం వలన రైతులు దేశాన్ని కాపాడారని వివరించారు. రైతు నామస్మరణం చేస్తున్న ప్రభుత్వాలు ఆచరణలో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తూ ధనిక వర్గానికి కొమ్ముగాస్తున్నాయని దుయ్యబట్టారు. నల్లధనాన్ని వెనక్కి తీసి దేశంలోని ప్రతి ఒక్కరి ఖాతాల్లో డబ్బు వేస్తానని చెప్పి మోడీ మోసం చేశారని, అదాని, అంబానీ అకౌంట్లకు ప్రజాధనాన్ని మళ్లించారని విమర్శించారు. పురుగు మందులపై ధరల నియంత్రణ లేకుండా వ్యాపారుల చేతుల్లో పెట్టారని, మీటర్లంటూ ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు పొడుతుస్తున్నారని అన్నారు. అనంతరం కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, గుంటూరు జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడారు. బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన కారు

ప్రజాశక్తి-రొంపిచర్ల

వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలో మర్రిచెట్టు పాలెం గ్రామంలో హైవే రోడ్డు పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలో విప్పర్ల గ్రామానికి చెందిన తోట చిన్న మస్తానయ్య (36) రొంపిచర్లకు పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వచ్చారు. పనులు ముగిసిన అనంతరం తన స్వగ్రామానికి వస్తున్నారు. హైవే రోడ్డు పై వెళుతున్న ద్విచక్రవాహనాన్ని మార్గమధ్యలో మర్రిచెట్టు పాలెం గ్రామంలోకి రాగానే వెనుక వైపు నుంచి చైన్నై నుండి హైదరాబాద్ వైపుకు వేగంగా వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు బైక్‌ను కొంతదూరం ఈడ్చికెళ్లడంతో మస్తానయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. కారు డ్రైవర్ ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ. సురేష్ బాబు తెలిపారు.

ఆటో ఢీ కొట్టి..

ప్రజాశక్తి-మేడికొండూరు

రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నరసరావుపేట రోడ్డు రవీంద్ర హెూటల్ సమీపంలోని మూలమలుపు వద్ద సోమవారం జరిగింది. డోకిపర్రు కరెంట్ ఆఫీస్ సమీపంలోని శాంతిన గర్‌కు చెందిన వేముల శ్రీనివాసరావు, ద్విచక్ర వాహనంపై పేరేచర్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ఆటో ముందు వాహనాన్ని తప్పించే క్రమంలో, వేగ నియంత్రణ కోల్పోయి, ఎదురుగా వస్తున్న దిచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న వేముల శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108 సాయంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ ఆటోను ఆపకుండా ఉడాయించాడు.

రొంపిచర్లలో మృతుడు చిన్న మస్తానయ్య(36), ప్రమాదానికి కారణమైన కారు

మేడికొండూరు ప్రమాదంలో గాయాలపాలైన శ్రీనివాసరావు

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ప్రజాశక్తి- మేడికొండూరు

రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని, రోడ్డు పై వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటన ఇటీవల మేడికొండూరు ప్రధాన సెంటర్లో జరిగింది. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మేడికొండూరుకు చెందిన కొత్తూరు పరమేశ్వరరావు(45) గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

యాక్సిడెంట్ కేసులో ముద్దాయికి 6 నెలల జైలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

యాక్సిడెంట్ కేసులో ముద్దాయి సూరపనేని రామచంద్రయ్యకు 6 నెలల జైలు, రూ.3వేలు జరిమాన విధిస్తూ జిల్లా ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి.స్పందన సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2015 అక్టోబర్ 10న ఉదయం 7.30 సమయంలో సూరపనేని రామచంద్రయ్య కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ, నేషనల్ హైవే-16లోని శరత్ చంద్ర కోల్డ్ సోరేజి వద్ద ద్విచక్రవాహనంపై వస్తున్న ఎన్నారెడ్డి కేశవరెడ్డిని ఢీకొట్టడంతో అతను వాహనం నుండి కిందపడి గాయాలపాలయ్యాడు. అక్కడున్న కొందరు అతన్ని దగ్గర్లోని హాస్పిటల్లో చేర్పించారు. సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు హాస్పిటల్‌కు వెళ్లి, విచారించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు పూర్తి చేసి, ఛార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొందెల అబ్రహం సాక్షులను విచారించి, కోర్టులో వాదనలు వినిపించారు. కేసు రుజువు కావటంతో న్యాయమూర్తి పై మేర తీర్పు వెలువరించారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -దుగ్గిరాల

డెల్టా కాలువ కొమ్మమూరు కెనాల్‌లో స్థానిక పిహెచ్‌సి వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు.విఆర్ఓ కంచర్ల ఫకీర్ ఇచ్చిన ఫిర్యాదుతో దుగ్గిరాల ఎస్ఐ ఎ. శ్రీనివాస్ రెడ్డి మృతదేహాన్ని కాలువ నుండి తీయించి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి సుమారు 35 నుండి 40 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై గోధుమరంగు హాఫ్ షర్ట్, కాఫీ కలర్ షార్ట్ కలిగి ఉన్నాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బకింగ్‌హామ్ కాలువలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం గాలింపు

ఆదివారం ఉదయం డెల్టా ప్రధాన కాలువ బకింగ్ హామ్ కెనాల్‌లో గల్లంతు అయినట్లు భావిస్తున్న స్థానిక దళిత వాడుకు చెందిన యువకుడు మేడికొండ అశోక్ కుమార్ కోసం ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సోమవారం కాలువలో గాలించాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు గాలించిన ప్పటికీ అశోక్‌కుమార్ ఆచూకి లభించలేదు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	29,912
మిర్చి ఎగుమతి	:	28,563
మిర్చి నిల్వ	:	10,308

మిర్చి ధరలు

రూపాయలలో

334	10000 - 25000
నెం-5	10000 - 25000
273	18000 - 20000
341	14000 - 27500
4884	19500 -19500
నాన్ ఎసి	
తేజ	9000- 23000
బడిగి	14000 -27400
దేవనూర్ డీలక్స్	12000 - 28000
తాలుకాయలు	5000-14000
ఎసి	
334	10000 -27500
నెం-5	18000- 18000
341	19000-19000
తేజ	12500-24000
బడిగి	24000-27500
దేవనూర్ డీలక్స్	20000- 22000
తాలుకాయలు	5,200 - 12,000

రీ ఫిల్లింగ్ స్థావరంపై విజిలెన్స్ అధికారుల దాడి

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని బుడ్డయ్య వీధిలో కెవిపి గ్యాస్ రీ పీలింగ్ షాప్ పై గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడి చేశారు. షాపులో ఉన్న 60 గ్యాస్ సిలిండరలను సీజ్ చేసి మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ స్థావరంలో ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ నుండి 2,4 కేజీల చొప్పున సిలిండర్‌లోనికి అక్రమంగా గ్యాస్ రీ పిల్లింగ్ చేసినట్లుగా గుర్తించినట్లుగా అధికారులు తెలిపారు. దాడిలో విజిలెన్స్ సిఐ లక్ష్మారెడ్డి, తహశీల్దార్ నాగ మల్లేశ్వరరావు, ఏఎస్ఓ లక్ష్మీ నారాయణ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌లను సీజ్ చేస్తున్న అధికారులు

దస్తావేజులు పోయినవి

తాడికొండ మండలం, తాడికొండ గ్రామానికి చెందిన ఆళ్ల హరిప్రసాద్ రెడ్డి ఇంటి స్థలానికి సంబంధించిన దస్తావేజు నంబర్ 55/1957 దస్తావేజులు నవంబర్ నెల 15 వ తేదీన ఆటోలో తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లుచుండగా మార్గమధ్యంలో పోయినవి ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నాకు సమాచారం ఇవ్వవలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు
ఆళ్ల హరిప్రసాద్ రెడ్డి
ఫోన్: 9396854987
7483222852

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి సత్తెనపల్లి వారి కోర్టులో
ఓ.ఎస్ 181/2021

బిట్వీన్:
మోటమర్రి నాగేశ్వరావు ...వాది
మరియు
తల్లం శ్రీనివాసరావు(డైడ్) మరియు వగైరాలు ...ప్రతివాదులు

డి3:మున్నంగి శ్రీనివాసరెడ్డి, తండ్రి వెంకటరెడ్డి ఆర్/ఓ. జొన్నలగడ్డ, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా.

పై కోర్టులో, పై నెంబరు దావాను దాఖలు చేసి, షెడ్యూలు దాఖలా ఆస్తిని రిజిష్టరు చేయించి వ్రాయించి ఇవ్వమని కోరి యున్నాము. సదరు దావాలోని 3వ ప్రతివాదికి కోర్టు ద్వారా రెండు మూడు పర్యాయములు నోటీసులు పంపినను వాయిదాలు తెలిసి నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం ది.31-12-2022నకు వాయిదా వేసి యున్నారు. కాన ది.31-12-2022న మీరు గాని, మీ తరపున లాయరు గారు గాని ఉదయం 10-30 గంటలకు పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోని యెడల మీ పరోక్షమందు విచారించి, తీర్మానించబడును.

ఇట్లు
శ్రీ మట్టుపల్లి వెంకట సుబ్బారావు,
వాది తరపు న్యాయవాది,
మట్టుపల్లి కాంప్లెక్సు, అరండల్ పేట 9/1,
మెయిన్ రోడ్, గుంటూరు.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 413/2022

బిట్వీన్:
నంబూరు ప్రవీణ్ కుమార్ ...వాది
ఎదిరి
కంకణంపాటి వేణు మాధవ్ ...ప్రతివాది

టు,
కంకణంపాటి వేణు మాధవ్, తండ్రి మారుతి ప్రసాద్, బూతుమిల్లి గ్రామము, వేమూరు మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.30-11-2022వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం.10-30ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా:30-11-2022

బి.విజయకుమార్,
డి.కిరణ్మయి,
వాది తరపు అడ్వకేట్స్
తెనాలి, సెల్ నెం.9440853817

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం 479/2019 ఇన్ ఐ.పి.నెం. 18/2014

బిట్వీన్:
Official Receiver, Guntur. Rep by P.V.Koteswara Rao, S/o Koteswara Rao, District Court Complex, Guntur.....పిటీషనర్
ఎదిరి
Alla Kousik and Others ...రెస్పాండెంట్స్

To,
R1: Alla Kousik
S/o Viswanadha Satyanarayana
R2: Alla Priyanka,
W/o Devarapalli Sankara Reddy.
All are R/o D.No.6-3-13,
Near Venugopala Swamy Temple Street,
Ganganammapet,Tenali.

పై నెంబరు ఐ.ఎ.నెం 479/2019 దావాలో మీకు శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.1-12-2022వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం.10-30ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా:1-12-2022

ఆర్.రాఘవేంద్రరావు,
పిటీషనర్ తరపు అడ్వకేట్, తెనాలి.
సెల్ నెం.9959079598

జనరల్ నోటీసు
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
యస్.ఓ.పి.నెం. 235/2022

బిట్వీన్:
సపా మాధవీ దేవి ...పిటీషనరు
మరియు
1.డిప్యూటీ డైరెక్టర్, కలెక్టరేట్ కాంపస్, డిస్ట్రిక్టు ట్రెజరీ ఆఫీసు, గుంటూరు.
2.డివిజనల్ సబ్ ట్రెజరర్, తెనాలి ...రెస్పాండెంట్స్

పై నెంబరు పిటీషనులో పిటీషనరును మంగళపూరి ముత్తమ్మ, భర్త, మారయ్యకు పిల్లలు లేని కారణమున ముత్తమ్మ అక్క అయిన దండకట్టు చినసత్తెమ్మ కుమార్తె అయిన సదరు పిటీషనరును పెంచుకొని యున్నారు. ముత్తమ్మ పై1, 2 రెస్పాండెంట్స్ నుండి పెన్షన్ తీసుకొనుచు ముత్తమ్మ ది. 25-9-2021న చనిపోయి నందున, సదరు పిటీషనరు రెస్పాండెంట్లు 1 మరియు 2 వారల నుండి రావలసిన మట్టి ఖర్చులు మరియు 24 రోజుల పెన్షన్ తీసుకొను నిమిత్తము సదరు పిటీషన్ దాఖలు చేసియున్నది. సదరు పిటీషనరుకు సక్సెషన్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్నయెడల ది.30-11-2022 వ తేదీ ఉదయం గం.10-30 నిమిషములకు స్వయముగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో సదరు పిటీషనును మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని యావన్మందికి తెలియజేయుచున్నాము.

వాయిదా తేది:30-11-2022

ఇట్లు
మధుకర్ కనపర్తి,
యస్.ఆది నారాయణ,
పిటీషనరు తరుపు న్యాయవాదులు,
తెనాలి, సెల్ నెం.9703013916.

COURT NOTICE
IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE TENALI
IA 850/2019 in CR.IP 18/2014

Between:
1.Surisetty Venkateswara Rao
2.Surisetty Lakshmi Prasamma
...Petitioners/R3-R4 Main IP
VS
Tamma Venkata Sudhakara Reddy & Others ...Respts/Petitioner in Main IP

To,
R2: Alla Kousik
S/o Late Viswanadha Satyanarayana
Ganganammapet, Near Venugopala Swamy Temple, D.No.6-3-13, Tenali.
R3: Alla Priyanka,
W/o Devarapalli Sankara Reddy,
Ganganammapet, Near Venugopala Swamy Temple, D.No.6-3-13, Tenali.

పై నంబరు పిటీషనులో R2-R3 లయిన మీకు కోర్టు ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి order ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా మీ నోటీసుకై ది.1-12-2022వ తేదీకి వాయిదా వున్నది. సదరు తేది వుదయం 10-30గం॥కు పై కోర్టులో మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలును తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా:1-12-2022

ఇట్లు
షేక్ ఫిరోజ్ బాషా,
పిటీషనర్ల తరపు అడ్వకేట్, తెనాలి.

ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీమతి అంగిరేకుల శివపార్వతి భర్త సాంబశివరావు, నివాసం జొన్నలగడ్డ వారి పాలెం గ్రామం, తుమ్మలపాలెం పంచాయితీ, కావూరు శివారు, చెరుకుపల్లి మండలం, బాపట్ల జిల్లా, అను వారి నుండి సంజాయిషీ పొంది ఇచ్చుచున్న ప్రకటన.

నా క్లయింటు గుంటూరు పట్టణము, పాత గుంటూరు ఏరియా, గుంటూరు డి.నెం.679లో 105.5/9 చదరపు గజముల స్థలమును విక్రయ దస్తావేజు నెం.6532/2011 ద్వారా 02-06-2011వ తేదీన అవ్వారి లక్ష్మీసావిత్రి గారి నుండి కొనుగోలు చేసినారు. సదరు విక్రయ దస్తావేజునకు లింకు దస్తావేజు 12176/2004గా అయివున్నది. సదరు లింకు దస్తావేజును జిరాక్స్ తీసుకునే నిమిత్తం ది.31-10-2022న ఉదయం 10 గంటల ప్రాంతంలో వారి గ్రామం నుండి ఆటోలో బయలుదేరి చెరుకుపల్లి సెంటర్‌లో గల జిరాక్స్ షాపునకు వెళ్లి చేతిబుట్టలో చూడగా ఓరిజినల్ లింకు దస్తావేజు గల ప్లాస్టిక్ కవర్ కనిపించలేదు. ఆటోలో ప్రయాణించు సమయంలో దారిలో పడిపోయి ఉండవచ్చునని ఆటోలో ప్రయాణించిన దారిలో ఎంతగా వెతికినను కనిపించ లేదు. సదరు లింకు దస్తావేజు పుచ్చకాయల ద్రాక్షాయమ్మ వగైరాలచే అవ్వారి లక్ష్మీసావిత్రి గారి పేరు మీద 16-09-2004వ తేదీన గుంటూరు జిల్లా రిజిస్టర్ ఆఫీసు నందు విక్రయ దస్తావేజు నెం.12176/2004 గా రిజిస్టర్ కాబడినది. సదరు పైన తెలిపిన లింకు దస్తావేజు నెం.12176/2004 ఎవరికైనను లభ్యమైనచో నాకు గాని నా క్లయింటునకు గాని అందజేయవలసినదిగా ఈ ప్రకటన ద్వారా కోరడమైనది. ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు వుంటే 7 రోజులలోగా తెలియజేయగలరు.

గ్రంథి జయరామకృష్ణ, అడ్వకేట్,
డోర్ నెం.2-5-70, ఘంటావారి వీధి, గాంధీనగర్,
తెనాలి, సెల్:9440989840

సంక్షేమం, అభివృద్ధికి కృషి: జెసి

- 'స్పందన'కు 110 ఫిర్యాదులు
- త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-నరసరావుపేట

అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి శ్యామ్‌ప్రసాద్

పల్నాడు జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని 'స్పందన' ప్రజా సమ స్యల పరిష్కార కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి తమ వినతిపత్రాలు సమ ర్పిం చారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన జెసి, సంబంధిత అధికారులకు వాటిని అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 110 మంది దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. 'స్పందన' కార్యక్రమానికి విశేషంగా తరలి వచ్చిన ప్రజలకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ తరపున ముప్పాళ్ళ మండలానికి చెందిన ప్రముఖ వ్యాపారి, ఎల్.ఐ.సి విభా గం చీఫ్ అడ్వైజర్, విశ్వ జననీ ఫౌండేషన్ ప్రతినిధి పొత్తూరి నాగేశ్వరరావు అన్నదానం కార్య క్రమానికి సహకారమందించారు. అన్నదాన కార్యక్రమానికి సహ కరించిన దాతలను ఈ సంద ర్భంగా జిల్లా జాయింట్ సత్కరించారు.

పిడి కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

గ్రూపులో సభ్యులకు తెలియకుండా లావాదేవీలు

ప్రజాశక్తి-నరసరావుపేట

తమ సంఘం లావాదేవీలు సభ్యులమైన తమకు తెలియకుండా జరుగుతున్నాయని దాచేపల్లి మండలం గామాలపాడుకు చెందిన స్రవంతి మహిళా పొదుపు సంఘం మహిళలు ఆరోపించారు. ఈ మేరకు కోటప్పకొండ వద్ద గల ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో, స్పందన కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు చేశారు. అవకతవకలపై స్థానిక ఎపిఎం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని, దిక్కున్నచోట చెప్పుకోమంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రూపు లోను తీసుకునేందుకు సభ్యులు నిర్ణయం తీసుకోగా గ్రూప్ సభ్యుల్లోనే కొంతమందితో స్థానిక అధికారులు కుమ్మక్కయ్యారని, తప్పనిసరిగా ప్రతి సభ్యురాలు లోను తీసుకున్న వెంటనే ప్రతి ఒక్కరూ రూ. 4 వేలు చెల్లించాలని వివోఎ ద్వారా లంచం అడిగారని ఆరోపించారు. లంచం ఇచ్చేందుకు తిరస్కరించినందుకు మిగిలిన గ్రూపు సభ్యులు తమకు తెలియకుండా పొదుపు ఖాతాలోని డబ్బులను డ్రా చేయడం జరిగిందని తెలిపారు. తేదీలను పొందుపరచని, అధికారుల వద్ద ఆమోదం పొందని తీర్మానాలను బ్యాంకు అధికారుల వద్దకు తీసుకెళ్లి గ్రూప్ పేరుతో లోన్ తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే గ్రూపు నుంచి తమను తొలగించామని అధికారులు, అధికారులతో కుమ్మక్కైన గ్రూపునకు చెందిన మరో మహిళ దురుసుగా సమాధానం చెప్పారని, అందుకే ఫిర్యాదు చేస్తున్నట్లు మహిళలు పేర్కొన్నారు.

జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

హెల్ప్ లైన్ సేవలు వృద్ధులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

వయో వృద్ధుల సహాయం కొరకు ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సేవలను ఉపయోగించుకోవాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం సమావేశ మందింలో జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ 14567 వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సమాచారం, భావోద్వేగ సహాయం, తల్లిదండ్రులు-వృద్ధుల చట్టాలు, వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై న్యాయసలహాలు, సూచనలు, క్షేత్రస్థాయిలో సహాయం కోసం ఈ టోల్ ఫ్రీ నెంబర్‌ను వారుఉపయోగించుకోవాలని సూచించారు. 14567 పై వృద్ధులకు, తల్లిదండ్రులకు అవగాహనా కలిగేలా జిల్లా యంత్రాంగం చూడాలని, ప్రతి సచివాలయం సిబ్బంది ఈ నెంబర్ పై ప్రజలకు విధిగా అవగాహన కలిగించాలని అన్నారు. తల్లితండ్రులకు,వృద్ధులకు ఏ అవసరం వచ్చినా 14567 కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బత్తుల మురళి (ఇండియన్ రెడ్ క్రాస్), ఏవిఎల్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎఫ్‌ఆర్‌ఓ కె. వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతో పెన్షన్ నిలిచిపోయింది

690 అడుగుల మట్టి మిద్దె ఉంటే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో 1259 అడుగులు ఉన్నట్లు నమోదు చేయడంతో హెల్త్ పెన్షన్ ఆగి పోయిందని గురజాల గాంధీ బొమ్మ సెంటర్‌కు చెందిన పిన్నెబోయిన నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. జులై నెల నుండి ఇప్పటివరకు ఐదు సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరవై ఏళ్లుగా వస్తున్న పెన్షన్ సచి వాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో నిలిచిపోయిందని అనారోగ్యంతో ఎటువంటి పని చేయలేని పరి స్థితి అని పేర్కొన్నారు. త్వరితగతిన పెన్షన్ పునరుద్ధరించి ఆదుకోవాలని కోరారు.

ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి

రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత బ్రతుకుదెరువు ఇతర రాష్ట్రాలకు వలసలు పోతు న్నారని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివా రెడ్డి అన్నారు. ఈ మేరకు తెలుగు యువత ఆధ్వర్యంలో స్పందనలో ఫిర్యాదు చేశారు.వైసిపి అధి.కారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరు ద్యోగ యువతను మోసం చేసారని ఎద్దేవాచేశారు. నూతన జాబ్ క్యాలెండర్ విడుదల, డిఎస్సి, టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొనుగోటి శ్రీనివాసరావు, పల్నాడు అధ్యక్షులు కె. కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్. గంగయ్య, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

ధర్నా చౌక్ స్థలం కోసం వినతి

నూతన పల్నాడు జిల్లా కేంద్రంలో ధర్నా చౌక్ స్థలాన్ని కేటాయించాలని జై భీమ్ భారత్ పార్టీ ఎంఐఎం, బిసి సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'స్పందన'లో వినతిపత్రం అందజేశారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ నూతన పల్నాడు జిల్లా కేంద్రంలో జిల్లా ప్రాంతంలో పేద బడుగు బలహీన వర్గాల సమస్యల పక్షాన పని చేస్తున్న వివిధ దళిత, కుల ప్రజా సంఘాలు ఆ సమస్యలు పరిష్కారం కోసం శాంతి యుత నిరసన తెలిపేందుకు ధర్నా చౌక్ కి సంబంధించి స్థలాన్ని కేటాయించాలని పలు మార్లు స్పందనలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. స్థలాన్ని చూపించిన అధికారులు అధికారికంగా అప్పగించలేదని తెలిపారు. జెసి స్పందిస్తూ త్వరితగతిన స్థలాన్ని కేటాయించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. జై భీమ్ భారత్ పార్టీ నరసరావుపేట ఇన్‌ఛార్జి గోదా జాన్ పాల్,ఎంఐఎం జిల్లా సెక్రెటరీ షేక్ మస్తాన్ వలి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీను, ఎంఆర్‌పిఎస్ పట్టణ ఇన్‌ఛార్జి జి.నగేష్, మాల మహానాడు నియోజకవర్గ సెక్రటరీ జె.జాన్ ప్రకాష్, బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గురు, ఎంఐఎం పట్టణాధ్యక్షులు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

కోడలితో ప్రాణహాని ఉంది..

కోడలితో తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ ములకా రామలక్ష్మారెడ్డి దంపతులు ఫిర్యాదు చేశారు. తమకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. విద్యాబుద్ధులు నేర్పి వివాహాలు చేశాం. అయితే, పెద్దకుమారుడు ఇటీ వల అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబంపై ఉన్న అప్పుల నేపథ్యంలో పొలం అమ్మి అప్పులు తీరుద్దామంటే, అప్పులతో తమకు సంబంధం లేదని తన భర్త వాటా తనకు ఇవ్వా ల్సిందేనంటూ పెద్ద కోడలు, ఆమె బంధువులు ఒత్తిడి చేస్తున్నారని వినుకొండ మండలం చీకటిగలపాలెంకు చెందిన ములకా రామలక్ష్మారెడ్డి స్పందనలో ఫిర్యాదు చేశారు. తనకు రూ. 30 వేల అద్దెలు వచ్చే హోటల్ భవనం ఉందని, కొడుకులిద్దరు చెరో రూ.5 వేలు తీసుకొని వృద్ధాప్యంలో అవసరాలు దృష్ట్యా రూ.20 వేలు తమకు ఇచ్చేవారని అన్నారు. కానీ, కోడలు తరపు బంధువులు అద్దె మొత్తం తమకే ఇవ్వాలని అద్దెదారుడిని బెదిరిస్తు న్నారని, కోడలు వలన తమకు ప్రాణహాని ఉందంటూ భార్య ములకా బుల్లెమ్మతో కలిసి లక్ష్మారెడ్డి ఫిర్యాదు చేశారు.

బిసి కులగణన చేయాలి

దేశంలో రాష్ట్రంలో కానీ 50 శాతం పైగా ఉన్న బిసిలకు కల్పించిన 27 శాతం రిజ ర్వేషన్ సరి పోదని రాష్ట్ర వ్యాప్తంగా ఓసీలు 10 శాతం ఉంటే 10 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు 50 శాతం ఉన్న బిసి లకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంక్షేమ సం ఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పందనలో ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంఘం రాష్ట్ర అధ్య క్షులు కేసన శంకరరావు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా స్పందనలో వినతిపత్రాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలను కేవలం ఓటు బ్యాంకులా చూస్తున్నారు కానీ బిసిల అభివృద్ధికి చేసేందేమి లేదని విమర్శించారు. కులగణన చేసి భారత రాజ్యాంగ హక్కుల ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి: ఎస్పీ

ప్రజాశక్తి-నరసరావుపేట

స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని, వచ్చిన ఫిర్యాదులు తిరిగి మళ్ళీ రాకుండా ఫిర్యాదుల పరిష్కా రానికి బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుండి 67 ఫిర్యాదులు అందాయని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరి ష్కరించడానికి కృషి చేయాలని ఆదేశించారు. స్పందనలో అదనపు ఎస్పీ(అడ్మిన్) జి. బిందుమాధవ్, డిఎస్పీ లు విజయ భాస్కర్‌రెడ్డి, కమలాకర్, రవిచంద్ర, జయరాం ప్రసాద్, సీఐ సుభాషిణి,ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన'లో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

కబ్జా కోరల నుండి భూమి విడిపించండి

అధికార పార్టీకి చెందిన నాయకులు గ్రామ సర్పంచ్ అండదండలతో రెచ్చి పోతున్నారని, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని నకరికల్లు మండలం కుంకలగుంటకు చెందిన కరుణమ్మ తన తల్లితో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమకు వారసత్వంగా సంక్రమించిన భూమిని గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కాజేయాలనే ఉద్దేశ్యంతో ఇటీవల వ్యవ సాయ పనులు చేస్తుండగా కూలీలలపై రాళ్లు రువ్వారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలంలోకి అడుగుపెడితే చంపేస్తామని బెదిరిస్తున్నారని, కావాలనే తమ పొలా న్ని కబ్జా చేశారని వాపోయారు. సర్వే చేయించి అధికారులు వేసిన రాళ్లను కూడా పీకి వేశారని నకరికల్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని న్యాయం చేయాలని కోరారు.

జిల్లా కబడ్డి జట్టుకు 'జై భారత్' విద్యార్థి ఎంపిక

క్రోసూరు-ప్రజాశక్తి

బి. మోతిలాల్ నాయక్

స్థానిక జై భారత్ విద్యా సంస్థలకు చెందిన 10 వ తర గతి విద్యార్థి బి.మోతిలాల్ నాయక్ జిల్లా స్థాయి కబడ్డి జట్టుకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల డైరెక్టర్ టి. జైనేంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ పెదకూరపాడులో జరిగిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలలో మోతిలాల్ నాయక్ అత్యుత్తమ క్రీడానైపుణ్యం కనబరిచి జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికవ్వడం సంతోషకర మని తెలిపారు. జై తమ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు ఒక్క చదువులోనే కాకుండా చిత్ర లేఖ నం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు, డ్యాన్స్, కుంగ్‌ఫూ, కరాటే వంటి వాటి లో కూడా ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మోతిలాల్ నాయక్‌కు కబడ్డీలో శిక్షణ ఇచ్చిన పి.ఈ.టి కె.స్వాతికి, మోతిలాల్ నాయక్ తల్లిదండ్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మోతిలాల్ నాయక్‌ను ప్రధానోపా ధ్యాయులు ఖదీర్‌బాబ, ఉపాధ్యాయులు అభినందించారు.

స్పందనకు 115 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

స్పందనలో ప్రజల నుండి అందిన వినతులను పరిశీలించి, సత్వరమే హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కే. చంద్ర శేఖర రావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి 115 మంది అర్జీదారులు స్పందనలో అర్జీలు అందచేశారు. కార్యక్రమంలో జెడ్పీ సిఇఒ శ్రీనివాస రెడ్డి, డిఆర్‌డిఎ డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, డిపిఒ కేశవరెడ్డి, సంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, డీటీసీ షేక్ కరీం, డియంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుమయాఖాన్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ చికిత్సలో శ్రీబాలాజీ హాస్పిటల్ మోసం

తన తండ్రికి చికిత్స కోసం ఆరోగ్యశ్రీ వర్తించదని తమతో డబ్బులు కట్టించుకొని, సిఎం రిలీఫ్ ఫండ్ కోసం బిల్స్ ఇవ్వమని అడిగితే ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న గుంటూరులోని శ్రీ బాలాజీ హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని గురజాల మండలం, గోగులపాడుకు చెందిన ఆర్.మనోహర్‌రెడ్డి వినతిపత్రం అందచేశారు. తన తండ్రి పాపిరెడ్డికి షుగర్, కిడ్నీ వ్యాధికి ఆగస్టులో హాస్పిటల్‌లో చేర్పించామని, మొదట ఆరోగ్యశ్రీ వర్తించదని చెప్పటంతో రూ.5 లక్షలు నగదు చెల్లించామన్నారు. చికిత్స అనంతరం నెల రోజుల తర్వాత తండ్రి మృతి చెందాడన్నారు. చికిత్స కోసం అయిన ఖర్చు కోసం అప్పు చేశామన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవటానికి బిల్స్ అడిగితే ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. హాస్పిటల్ వారికి ఆరోగ్యశ్రీ కింద డబ్బులు వచ్చాయని, అందుకే తమకు బిల్లులు ఇవ్వట్లేదని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. కావున తనకు న్యాయం చేయాలని కోరారు.

యువతకు రుణాలు ఇవ్వాలి : తెలుగు యువత

నిరుద్యోగుల సమస్యలపై తెలుగు యువత ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి, స్పందనలో అర్జీ అందచేశారు. తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ యువతకు స్వయం ఉపాధికి ఆయా ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జిల్లాల వారీగా పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చాక రెండున్నర లక్షల పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చారని కానీ నెరవేర్చలేదన్నారు. మెగా డిఎస్‌సి ఇవ్వాలని, ప్రతి ఏటా 6వేల పోలీసు పోస్టుల భర్తీ ఊసు లేదన్నారు. చదువుకున్న యువత ఉపాధి అవకాశాలు లేక పక్కదారి పడుతున్నారన్నారు. తక్షణమే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో మూడుసార్లు అర్జీలిచ్చాను

నాలుగేళ్లుగా తాగునీటి కోసం వెతలు : ఉప్పలపాడు సర్పంచ్ కె శ్రీనివాసరావు

నాలుగు సంవత్సరాల నుండి తాగునీటి సమస్యను పరిష్కరించమని కోరుతున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోవట్లేదని ఉప్పులపాడు గ్రామ సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికే స్పందనలో మూడు సార్లు అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఉప్పపాడు పక్షుల కేంద్రం వల్ల చెరువులో నీరు కలుషితం అవుతుందని, ఆ నీరు వాడిన ప్రజలకు చర్మవ్యాధులు, క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. గత టిడిపి హయాంలో మానస సరోవరం హెడ్‌వాటర్ వర్క్స్ నుండి నేరుగా నాబార్డ్ నిధులతో గ్రామానికి పైప్‌లైన్ వేశారని కానీ ఎన్నికల కోడ్ వల్ల పైప్‌లైన్ అనుసంధానం పనులు నిలిచాయని, ఆ పని పూర్తి చేస్తే తమకు నీటి సమస్య తీరుతుందన్నారు. కానీ నాలుగేళ్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు.

హక్కుల సాధనకు పోరాటాలే మార్గం

- దారిమళ్లిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి
- కెవిపిఎస్ రాజధాని డివిజన్ కమిటీ ఎన్నిక

మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి, వేదికపైన ఎం రవి తదితరులు

ప్రజాశక్తి - తుళ్లూరు

హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అన్నారు. సోమవారం తుళ్లూరులో కెవిపిఎస్ రాజధాని డివిజన్ కమిటీ 3వ మహాసభ సందర్భంగా దళిత హక్కుల సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆండ్ర మాల్యాద్రి ప్రసంగించారు. దేశంలో ఇప్పటికీ అసమానతలు, కుల వివక్ష కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. రాజధాని ప్రాంతం అనంతవరంలో అధికార పార్టీకి చెందిన దళిత మహిళా ఎమ్మెల్యే పై పెత్తందార్లు కుల వివక్షను ప్రదర్శించారని చెప్పారు. కె వి పి ఎస్ చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటైనప్పటికీ దళిత, గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పన ఇతర అంశాలలో ప్రభుత్వాలు నేటికీ చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లుతున్నాయని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండి పసుపు - కుంకుమ పథకానికి, జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల అమలుకు సబ్ ప్లాన్ నిధులను వినియోగించారని చెప్పారు. పాలకులు దళితులను ఓటు బ్యాంక్‌లుగా పరిగణిస్తూ తమ పబ్బాం గడుపు కుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక గ్రామాల్లో దళితులకు స్మశాన స్థలాలు లేవన్నారు. దళితులకు స్మశాన స్థలాలు కేటాయించాలని, స్థలాలు లేని పక్షంలో ప్రభుత్వమే స్థలం కొనుగోలు చేసి ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. ఆత్మ గౌరవం, సమానత్వం, కుల వివక్ష పై పోరాటాలకు కెవిపిఎస్ ఆవిర్భవించిందని, దళితులు, గిరిజనులు హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ రాజధాని డివిజన్ ఉపాధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ రాజధాని ప్రాంత అసైన్డ్ దళిత రైతులకు కౌలు, వారి భూములకు పట్టా భూములతో సమానంగా ప్యాకేజీ, అమరావతి సామాజిక జీవన భతి రూ 2,500లను రూ 5 వేలుకు పెంచాలని, రాజధాని పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలుచెల్లించాలని సదస్సులో తీర్మానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎన్ కిషోర్, నాయకులు ఎం భాగ్యరాజు, ఆర్‌టిఐ రాష్ట్ర అధ్యక్షులు పి చంద్రమోహన్ మహాసభలో సౌహార్ధ సందేశాలు ఇచ్చారు. తుళ్లూరులో పారిశుధ్య కార్మికులు చేపట్టిన రిలే దీక్షలకు ఆండ్ర మల్యాద్రి సంఘీ భావం తెలిపారు.

13 మందితో నూతన కమిటీ

కెవిపిఎస్ రాజధాని డివిజన్ నూతన కమిటీ 13 మందితో ఏర్పాటు అయ్యింది. అధ్యక్ష, కార్యదర్శులుగా కలిసేటి రమేష్, జొన్నకూటి నవీన్, ఉపాధ్యక్షులుగా ఎం రవి, అంకం కోటేశ్వరరావు, ఎం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా కైలా స్టాలిన్, వీరేంద్ర, మరో ఆరుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్' అమలులో

ప్రతిభ చూపిన వైద్యాధికారులకు కలెక్టర్ సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 6గురు మెడికల్ అధికారులకు సోమవారం జిల్లా కలక్టరేట్లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి శాలువా కప్పి సన్మానించారు. మన్నవ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ షేక్. మహమ్మద్ హుస్సేన్, దుగ్గిరాల మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.ఇందిరా, పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. తిరుమల దేవి, కొర్నెపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.శివాని, పెదపలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. అశ్విన్, డాక్టర్ ఝాన్సీ బాయ్‌లను ఈ సందర్భంగా కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.చంద్ర శేఖరరావు, డియంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుమయాఖాన్, డిసిహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావు, జెడ్పీ సీఈఓ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం అందుకున్న వైద్యాధికారులతో కలెక్టర్, జెసి, డిఎంఅండ్‌హెచ్ఒ తదితరులు

కిట్స్‌లో 'వ్యక్తిత్వవికాసం' పై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు : కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో వ్యక్తిత్వ వికాసంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యక్తిత్వ వికాసం, జీవిత సాఫల్యంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించటం ద్వారా సానుకూల ధృక్పదం ఎలా పెంపొందించుకోవాలో బోధించారు. ఈ కార్యక్రమానికి నవజాగృతి సొల్యూషన్స్‌పైలెట్ ఫ్యాకల్టీ తిరువీధి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పేరెంటింగ్, గోల్ అచీవ్‌మెంట్, సెల్ఫ్ డిస్‌ప్లే గురించి వివరించారు. ప్రతి విద్యార్థికి ఈ స్కిల్స్ ఉన్నత శిఖరాలను చేరుకోవటానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. భ్రమరా టౌన్‌షిప్ ఎండి రామచంద్ర, కళాశాల ఛైర్మన్ కె.సుబ్బారావు, సెక్రెటరీ కె.శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు ప్రసంగించారు.

నిరసనలో పాల్గొన్న సంఘం నాయకులు, కార్యకర్తలు

ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

- బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అశాస్త్రీయమని, రాజ్యాంగ విరుద్ధమని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరర్ అన్నారు. ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పును, 103వ రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసనల్లో భాగంగా సోమవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత బిసి కార్యకర్తలు హిందూ కాలేజి వద్ద జ్యోతిరావుపూలే విగ్రహం నుండి బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు సామాజిక వెనుకబాటుకు ఉద్దేశించినవని, కానీ సామాజికంగా ఉన్నత కులాలకు ఆర్థిక వెనుకబాటు పేరుతో రిజర్వేషన్లు కల్పిస్తే వెనుకబడిన కులాలకు మళ్లీ అన్యాయం జరుగుతుందన్నారు. గత 75 సంవత్సరాలుగా బిసి కులగణన చేయాలని డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని విమర్శించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ రాబోయే కాలంలో బిజెపి ప్రభుత్వం బిసి వ్యతిరేక ప్రభుత్వమని, బిజెపికి ఓటు వేస్తే బిసిల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నానాటికి కుదించటం వల్ల ఇప్పటికే రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరుగుతుందని, ఇప్పుడు ఇబిసి పేరుతో అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించటం సరికాదన్నారు. తక్షణమే ఇబిసి రిజర్వేషన్‌ను ఉపసంహరించు కోవాలని లేదంటే పెద్దఎత్తున ఉద్యమిసామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తన్నీరు ఆంజనేయులు, ట్రెజరర్ కన్న మాస్టరు, డాక్టర్ శేషయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్ల మీద అంబేద్కర్ బొమ్మ ముద్రించాలి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నియోజకవర్గ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాసు పథ్వీరాజ్ ఆధ్వర్యంలో మండల తాహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమలో సీనియర్ ఎస్‌టి నాయకులు దేవరకొండ నాగేశ్వరరావు దీక్షను వహించారు. ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి శ్రీను నాయక్ , చిలకలూరిపేట నియోజకవర్గ ప్రధాన సలహాదారులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, బీసీ నాయకులు తన్నీరు వీరాంజనేయులు, బత్తుల శ్రీనివాసరావు తదితరులు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌నకు వినతి పత్రం ఇచ్చారు.

'గడపగడపకు'లో అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

ప్రజాశక్తి-నరసరావుపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మండల అధి.కారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మితమవుతున్న రైతు భరోసా కేంద్రాలు, ఎస్సార్ హెల్త్ క్లినిక్, సచివాలయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. భూ సర్వే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూరి్తచేసి, భూ పంపిణీ కార్యక్రమం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ స్థాయికి పోకుండా చూడాలన్నారు. అదేవిధంగా స్వీప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నాడు-నేడు కింద చేపడుతున్న అభి వృద్ధి పనుల ప్రాంతంలో విధిగా గుర్తింపు బోర్డు లు ఉండేలా చూసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా జల జీవన్ మిషన్ కార్య క్రమం ద్వారా నిర్వహిస్తున్న పనుల వివ రాలు అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ల ద్వారా డిజిటల్ హెల్త్ కార్డులను అర్హులైన వారం దరికీ అందించేలా చర్యలు చేపట్టా లన్నారు. ప్రజలలో కుష్టు వ్యాధి నివారణ పై అవ గాహన పెంచేలా చర్యలు చేపట్ట డంతో పాటు సర్వే పనులు పూర్తి చేయా లని, జిల్లా లో పలు ప్రదేశాలలో డిజిటల్ అసిస్టెంట్‌ల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - అమరావతి

మండలపరిధిలోని మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ముగింపు సమావేశంలో సర్పంచ్ బి.విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకొని జ్ఞానసముపార్జన చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సామూహిక పుస్తక పఠనం చేయించారు. వ్యాస రచన, డిబేట్, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు, భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, భారత దేశ గ్రంథాలయ శాస్త్రీయ పితామహుడు ఎస్.ఆర్. రంగనాథన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, పేరేంట్స్ కమిటీ చైర్మన్ ఎస్.కె.సలావుద్దీన్, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎపిఆర్‌డిసి ఎస్ఎస్ఎస్, ఎన్‌సిసి విద్యార్థులతో ప్రిన్సిపల్ వైఎన్ఎస్ చౌదరి ఆధ్వర్యంలో విజయపురి సౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఎన్.సి.సి క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ కల్నల్ డి.విజయ్‌కుమార్, ఎన్‌సిసి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మహమ్మద్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపల్ కమిషనర్‌కు లేఖను అందజేస్తున్న టిడిపి ప్రతినిధులు

ఎన్నికల సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికలకు సంబంధించిన సమా చారం తమకు అందడం లేదని తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణబాబుకు వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితాకు చెందిన ప్రక్రియ, ఇతర సమాచారం తమ పార్టీ కార్యాలయానికి అందడం లేదని మున్సి పల్ కమిషనర్ రమణబాబుకు జూలకంటి బ్రహ్మా రెడ్డి లేఖ ద్వారా తెలియజేశారు. ఇక నుండి రాష్ట్ర ఎన్నికల అధికారి ఇచ్చే అన్ని ఉత్తర్వులను, ఎన్నికల ప్రక్రియలో భాగంగా జరిగే ఇతర సమాచారాన్ని టిడిపి పట్టణ ప్రతి నిధులు కె.దుర్గారావు, అన్వర్‌లకు తెలియజేయాల్సిందిగా కోరారు. ఈ మేరకు బ్రహ్మారెడ్డి రాసిన లేఖను కమిషనర్‌కు అందజేశారు.

సేవాలాల్ మహరాజ్ ఆలయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్,మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం విజయపురిసౌత్ లోని దేశవరపు క్యాంపు తండాలో శ్రీ సేవాలాల్ మహరాజ్, మహలక్ష్మమ్మ ఆలయ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.25 లక్షల వ్యయంతో చేపడుతున్న ఆలయాల నిర్మాణం ఐదు నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ కుళాయి కలెక్షన్ ఇచ్చేందుకు నిధులు మంజూరయ్యాయని 20 రోజుల్లో టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అటవీ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు త్వరలోనే పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి,మాచర్ల జడ్పీటీసీ మల్లు స్వామి తదితరులు పాల్గొన్నారు.

రిక్రియేషన్ క్లబ్‌పై ఎమ్మెల్యేకు వినతి

గ్రామంలోని స్థానికులు రిక్రియేషన్ క్లబ్ ను ఏపీఆర్ డిగ్రీ కళాశాల నుంచి స్వాధీనం చేసుకొని గ్రామ అవసరాలకు కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ అవసరాలకు క్లబ్ ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, ఏపీఆర్ డిగ్రీ కళాశాల వారు గ్రామస్తుల అనుమతి లేకుండానే దీనిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయనకు తెలిపారు. గ్రామంలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నా ఆలయాల్లోనే జరుపుకోవాల్సి వస్తోందని చెప్పారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రిక్రియేషన్ క్లబ్, గ్రామస్తులకు చెందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించండి

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి గిరిజన సంఘాల ఐక్య వేదిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రంలో, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వసతి గృహాల్లో చదువుతున్న ఎస్సి, ఎస్టి, బిసి, ముస్లిం మైనార్టీల విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందని ఎపి గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాలకులు కంటి తుడుపుగా సమీక్ష సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారే తప్ప విద్యార్థులకు తగిన న్యాయం జరగడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తలపెట్టిన స్పందన కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట మండల తహశీల్దార్ జి.సుజాతకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం తక్షణమే వసతి గృహాల్లోని విద్యార్థులకు నూలు దుప్పట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. చలికాలం దృష్ట్యా ప్రతి ఒక వసతి గృహంలో క్లినిక్ లు ఏర్పాటు చేయాలని కోరారు. చిలకలూరిపేట పట్టణ శివారులో ఉన్న గిరిజన బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు అరకొరగా ఉన్నాయని, అద్దె భవనంలోకి మార్చ మని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు సమస్యకు పరిష్కారం లభించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురికిపూడిలో ఉన్న వసతి గృహానికి మౌలి క సదుపాయాలు కల్పించాలన్నారు. ఎపి గిరిజన సంఘాల ఐక్యవేదిక పట్టణ గౌరవాధ్య క్షులు బాణావతు చిన్న నాయక్, అధ్యక్షులు పి, శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి దేవర డేవిడ్, తన్నీరు శివయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి-రాజుపాలెం

మండలంలోని గణపవరంలో ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న తుపాకుల శాంత కుమార్ (23) అనారోగ్యంతో గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడికి నాలుగు నెలల క్రితమే వివాహం జరిగింది. సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు.

ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని పెద్ద మద్దూరులో ఆర్వో ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. పాథమిక వ్యవసాయ శాఖ సహకార సంఘం నిధులతో, ఎనిమిది లక్షల వ్యయంతో ఈ ప్లాంట్‌ను నిర్మిచారు. పిఎసిఎస్ అధ్యక్షులు జాస్తి వెంకటరావు (జేవీఆర్), సొసైటీ కమిటీ సభ్యులు కుమ్మరి మికేల్, ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, జి.వెంక టేశ్వరరావు ఆధ్వర్యంలో ప్లాంట్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమద్దూరులో ఫ్లోరైడ్ నివారణకు, గ్రామస్తుల ఆరోగ్య సం రక్షణ కోసం ఈ ప్లాంట్ ఏర్పాటు చేసిన సొసైటీ అధ్య క్షులు జాస్తి వెంకటరావు అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.శ్రీనాథ్, ఎంపిటిసి పి.రమాదేవి, సొసైటీ సీఈఓ ఎం. వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

మండల పరిధిలోని ఎనికపాడులో నాడు- నేడు నిధులు రూ.24 లక్షలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.బాలస్వామి, సర్పంచ్ ఎన్. సూర్యనారాయణ, ఎన్.బాబురావు,అంగన్వాడి పాఠశాల సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాటిబండ్లలో 'గడపగడపకు'

ప్రజాశక్తి-పెదకూరపాడు

అభివృద్ధిని, అందుతున్న సంక్షేమ పథకాలను పరిశీలించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. సోమవారం పెదకూరపాడు మండలంలోని పాటిబండ్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కర పత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
మంగళవారం 22 నవంబర్ 2022

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

- 10 లక్షల చేప పిల్లలను కృష్ణా నదిలోకి విడుదల చేసిన ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి , కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

కృష్ణా నదిలోకి చేపలను వదులుతున్న ఎమ్మెల్యే ఆర్కే, కలెక్టర్

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా సోమవారం 10లక్షల చేపపిల్లలను స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి మత్స్యశాఖ అధికారులతో కలిసి కృష్ణానదిలో విడుదలచేశారు. ఉండవల్లి పడవల రేవు వద్ద జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కె మాట్లాడుతూ మరో 15లక్షల చేపపిల్లలను త్వరలో విడుదలచేస్తామని చెప్పారు. మత్స్యకారులు తమ చేపలను అమ్ముకునేందుకు వీలుగా రాష్ట్రంలో ఫిష్ఆంధ్రా పేరుతో 232 మాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా 9మంది మత్స్యకారులకు సబ్సిడీ మీద వాహనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, మత్స్యశాఖ డిఎఫ్ఓ వివిఆర్.బాబు, పలువురు అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైను ప్రారంభం

ముగ్గురోడ్డులోని కొండ ప్రాంత ప్రజలకు మంచినీరు అందేవిధంగా ఏర్పాటు చేసిన పైపులైన్‌ను సోమవారం ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. దీంతో కొండ ప్రాంతం పైనున్న ప్రజలకు కూడా మంచినీరు అందే అవకాశం ఏర్పడింది. ముగ్గురోడ్డులోని మంగళగిరి-విజయవాడ పాత జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న 6 బజార్లలో రూ.10లక్షలతో ఈ పైపులైను ఏర్పాటు చేశారు.

జగనన్న కాలనీవాసులతో సమావేశం

జగనన్న కాలనీవాసులతో స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తాడేపల్లిలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇంటి ముందు రోడ్డు వేసే సందర్భంగా తాడేపల్లి అమరారెడ్డి కాలనీలో ఉన్న ఇళ్లను తొలగించిన వారికి ఆత్మకూరులో ఇంటి స్థలాలు కేటాయించారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో బాధితులతో ప్రత్యేక సమావేశమై చర్చించారు. ప్రభుత్వం ఇస్తున్న హౌసింగ్‌లోను ఎలా దరఖాస్తు చేసుకోవాలో చెప్పి ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సచివాలయ అడ్మిన్‌లతో సమావేశం

తాడేపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి, కమిషనర్ యు.శారదాదేవి ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. 12 సచివాలయాల పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై రివ్యూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గాడిబావి సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-తెనాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని మున్సిపల్ హెల్తాఫీసర్ కెసిహెచ్ నిర్మల అన్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేదంపై మున్సిపల్ అధికారులు సోమవారం గాడిబావి సెంటర్, మార్కెట్ ఏరియాలో తనిఖీలు చేశారు. వ్యాపారుల వద్ద లభ్యమైన ప్లాస్టిక్ కవర్లను స్వాదీనం చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, మెప్మా సిటి మిషన్ మేనేజర్ మాధవరావు, వార్డు శానిటరి సెక్రటరీలు, మెప్మా సివోలు, నగరదీపికలు పాల్గొన్నారు.

ఎంపిడిఓ శ్రీరమ్యతో మాట్లాడుతున్న రజక సేవా సంఘం నాయకులు

చెరువు ఆక్రమణలు ఆపాలని వినతి

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

చెరువు ఆక్రమణలు ఆపాలని సోమవారం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం స్పందనలో ఎంపిడిఓ శ్రీ రమ్యకు రజక సేవా సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడులో రజక వృత్తిదారులకు స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న చెరువు అని గతంలో వృత్తిరీత్యా కేటాయించారని కానీ దానిమీద ఆదాయం మాత్రం పొందలేకపోతున్నామని వాపోయారు. చెరువు చుట్టూ ఆక్రమణ దారులు ఇల్లు కట్టుకోని చెరువును కలుషితం చెస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా వారికే మద్ధతుగా నిలుస్తున్నాయని, తమ గోడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఆక్రమణలు నిలుపుదల చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉదయగిరి మురళి, తలగడదివి కన్నాయ, పాశం శ్రీను, ఉప్పుల ఆనందరావు, శేఖర్, ఇనకొల్లు భగత్ పాల్గొన్నారు.

ఏఎన్‌యులో మత్స్యకారుల దినోత్సవం

ప్రజాశక్తి -ఎఎన్‌యూ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజి విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగ సీనియర్ అధ్యాపకులు జి.సింహా చలం పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ మత్స్య దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.ఆచార్య వీరయ్య, ఓఎస్‌డి సునీత, అధ్యాపకులు వెంకట రత్నమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి. సింహాచలం

ఓటంటే ఇంకు చుక్క కాదు..ప్రజాస్వామ్య వ్యవస్థ

మాట్లాడుతున్న కె. హేమమాలిని

ప్రజాశక్తి -మంగళగిరి

ఓటంటే ఇంకు చుక్క కాదని, అది ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ అని అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ,అడిషనల్ కమిషనర్ కె. హేమమాలిని అన్నారు. సోమవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిర్మలా జూనియర్ కాలేజ "ఓటర్లకు క్రమబద్ధమైన అవగాహన, ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల భాగస్వామ్యం" (ఎస్‌విఇఇపి) అంశముల పై 17-18 సంవత్సరాల యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రజలకు ప్రభుత్వాన్ని నిర్మించుకునే ఆయుధం అన్నారు. ప్రజాప్రతినిధులను ఎన్నుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని అబివృద్ధి చెందుటకు గల మహోన్నతమైన అవకాశమని చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకోవటం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. యువత తమ బాధ్యతగా భావించి మీ పరిధిలోని అందరికి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్, బూత్ లెవెల్ ఆఫీసర్లు, కళాశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న నాయకులు

అన్ని వర్గాలను దోచుకున్న ఘనత వైసిపిదే..

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదలకుండా అందరినీ దోచుకున్న ఘనత వైసిపికే దక్కుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వినుకొండ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కొత్తపేట పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సంక్షేమం అంటూ ఊదరగొడుతూ పేదల జీవన ప్రమాణాలను మరింత దిగజార్చిందన్నారు. ఇసుకలో దోపిడీ పరంపర కొనసాగుతోందని, అలాగే మద్య నిషేదం అంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి దానిని నియంత్రించలేకపోగా, ఏరులై పారిస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిని అక్రమ కేసులతో భయపెడుతున్నారన్నారు. వైసిపి పాలనకు గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో నాయకులు టి.హరిప్రసాద్, గడవర్తి సుబ్బయ్య, గిరి గణేష్, అన్నం పిన్నారావు, జొన్నాదుల మహేష్, దివి అనిత, కె.సుబ్రహ్మణ్యం, దివి హేమంత్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

జగనన్న గోరుముద్ద నూతన మెనూ ప్రారంభం

ప్రజాశక్తి-దుగ్గిరాల

పాఠశాలలో విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద నూతన మెనూ సోమవారం నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి కాజ శ్రీనివాసరావు పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించిన కట్ పొంగల్, కోడి గుడ్డు, వేరుశనగ చిక్కిలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. బాలసుందరం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

నెహ్రూనగర్ రైల్వే గేటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి అయ్యేలా ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షణ చేస్తున్నారని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాతో కలసి కొత్తపేట శివాలయం నుండి నెహ్రూ నగర్ రైల్వే గేటు వరకూ రూ.1.25 కోట్లతో 420 మీటర్ల పొడవు సిసి రోడ్డు, 390 మీటర్ల డ్రైన్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండి, ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేశామన్నారు. ముస్తఫా మాట్లాడుతూ రోడ్ల విస్తరణ ద్వారా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, 5వ వార్డ్ కార్పొరేటర్ యాట్ల రవి కుమార్, ఈ.ఈ. కోటేశ్వరరావు, డి.ఈ.ఈ. శ్రీనివాసరెడ్డి, ఏ.ఈ. రాంబాబు, పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్‌కీర్తి

కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

అధిక ధరలను తగ్గించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

పెరిగిన ఇంటిపన్నులతోపాటు నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని అలాగే పెరిగిన కరెంటు చార్జీలు, గ్యాస్ ధరలు, చెత్తపన్ను, ఆర్‌టిసి చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు కోరారు. రాజధాని గ్రామమైన పెనుమాకలో సోమవారం బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. పశువుల ఆసుపత్రి, ఆర్‌సిఎం చర్చి, వేమవరపు బజారు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.వీరేంద్రనాథ్, ఎన్.సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఎ.సుబ్బారావు, డి.కళ్యాణ్, కె.రాజశేఖరరెడ్డి, డి.జ్యోతిబసు, తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో ఐఇటిఇ, ఐట్రిపుల్‌ఇ అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులు తమ విజ్ఞానాన్ని అధ్యాపకులతో పంచుకోవాలని కెఎల్ విశ్వవిద్యాలయం గౌరవ అధ్యక్షులు, కోనేరు సత్య నారాయణ అన్నారు. సోమవారం కెఎల్ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ వర్చువల్ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన సభనుద్దేశించి ప్రసంగించారు. గేటెక్, డిఆర్.డిఒ చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్, సూక్ష్మ తరంగాలు, యాంటెన్నాల అధ్యయన, ఐట్రిపుల్‌ఈ హైదరాబాద్ విభాగంలోని డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్.సందీప్ కుమార్ చతుర్వేది ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎలక్ట్రానిక్స్ , కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ సదస్సు చైర్మన్, విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ ప్రారంభోపన్యాసం చేశారు. అధ్యాపకులు, పరిశోధన బృందం అధిపతి డాక్టర్. కె.ఎస్.రమేష్ అతిథులకు స్వాగతం పలికగా, డాక్టర్ ఎం.సుజాత సదస్సు కన్వీనర్‌గా, డాక్టర్ అర్జున ముదులి కో-కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈసిఈ విభాగం అధ్యాపకులు సదస్సు నిర్వహణ యొక్క సంక్షిప్త నివేదికను సమర్పించారు. విశ్వవిద్యాలయం వైస్.చాన్సలర్ డాక్టర్.జి.పార్ధసారధివర్మ మాట్లాడుతూ మలేషియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, సింగపూర్ వంటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు సులభతరమైన పద్ధతిలో పరిశోధన కథనాలను ఈ సదస్సులో సమర్పించారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో మొత్తం 150 పరిశోధన కథనాలను పరిశీలించగా వాటిలో 54 పత్రాలను వివిద సదస్సులలో ప్రదర్శన కోసం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రో-వైస్ చాన్స్ లర్ వెంకటరాం విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు ఎ.జగదీష్ తదితరులు కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్.జి.పార్ధసారధి వర్మ , ప్రో-వైస్ ఛాన్సలర్ వెంకటరాం , రిజిస్ట్రార్ ఎ.జగదీష్ గారు, ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, డీన్‌లు, పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత ప్రొఫెసర్ ప్రమీలరాణికి సన్మానం

ప్రమీలరాణిని సన్మానిస్తున్న వీసీ తదితరులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఫార్మసీ టీచర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో విష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డును ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.ప్రమీలరాణి అందుకున్నారు. ఫార్మసీ టీచర్స్ ట్రస్ట్ అధ్యక్షులు విలియం కేరి మాట్లాడుతూ బోధనా, పరిశోధనా పత్రాలు, ప్రాజెక్టులు, పరిశోధక విద్యార్థులను గైడ్ చేయడం వంటి అంశాల ప్రామాణికంగా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. అవార్డు అందుకున్న ప్రమీలరాణిని వర్సిటీలో సోమవారం సత్కరిం చారు. వీసీ పి.రాజశేఖర్, కో-ఆర్డినేటర్లు ఉదయ్ కుమార్, చెన్నారెడ్డి, నాగరాజు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సిద్ధయ్య, ఆర్కిటెక్చర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇ.శ్రీనివాసరెడ్డి, పరీక్షల నిర్వహణాధికార్లు నర్సారెడ్డి, ప్రకాష్, రెక్టార్ పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు

- సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు నాగరాణి
- పాలిటెక్నిక్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు శిక్షణ

విధివిధానాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాగరాణి తదితరులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

పరిశ్రమ, సాంకేతిక విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించడానికి వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేయనున్నట్లు సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు చదలవాడ నాగరాణి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలతో పరిశ్రమ సహకారాన్ని బలోపేతం చేసే క్రమంలో అనుసరించాల్సిన వ్యూహంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాల ప్రిన్సిపాళ్లకు ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నాగరాణి మాట్లాడుతూ పాలిటెక్నిక్ చివరి సంవత్సరం విద్యార్థులకు గుణాత్మక పారిశ్రామిక శిక్షణను అందించటంతో పాటు, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లను ఆకర్షించటం కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్ది, వారికి ఉపాధి అవకాశాలను చూపుతామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ జిఎం ఎన్.భాను మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పటి వరకు 4417 మంది విద్యార్థులు శిక్షణ పొందారని తెలిపారు. శిక్షణ ప్రాధాన్యంపై ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఎఫ్‌ట్రానిక్స్ సిఇఒ రామకృష్ణ వివరించారు. పారిశ్రామిక రంగం పురోగతిపై దేశాభివృద్ధి అధారపడి ఉందని, సంస్థల మనుగడ నిరంతర నవీకరణ, అభివృద్ధిపై ఆధారపడి ఉంటుందని వివరించారు. ఇందులో మానవ వనరులు ఎంతో కీలకమన్నారు. అనంతరం పారిశ్రామిక శిక్షణ మార్గదర్శకాలు, విధి విధానాల పత్రాన్ని నాగరాణి విడుదల చేయగా విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రేరణ కోసం రూపొందించిన లేఖలను ప్రిన్సిపాళ్లకు అందజేశారు. కార్యక్రమంలో ప్రకాష్ స్పెక్ట్రో కాస్ట్ ఎమ్‌డి పార్థసారధి, సాంకేతిక విద్యా శాఖ సంయుక్త సంచాలకులు వి.పద్మారావు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జెఎస్ఎన్ మూర్తి, ఎ.నిర్మల్‌కుమార్, ఉపసంచాలకులు రామకృష్ణ, ఎస్‌బిటిఇటి కార్యదర్శి కె.విజయభాస్కర్, సంయుక్త కార్యదర్శి కె.నారాయణరావు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో లోటుపాట్లను రానివ్వొద్దు

అధికారులతో సమీక్షలో పల్నాడు జెసి శ్యాంప్రసాద్ ఆదేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

ధాన్యం సేకరణలో లోటుపాట్లేమీ లేకుండా చూడాలని అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. 2022-23 ఏడాదికి ధాన్యం కొనుగోలుపై అధికారులతో జెసి సోమవారం సమీక్షించారు. ధాన్యం సేకరణకు కావాల్సిన గన్ని బ్యాగులను సేకరించాలని డిఎస్‌ఒను ఆదేశించారు. పల్నాడు జిల్లాలోని 347 రైతు భరోసా కేంద్రాలలో మాస్టర్ మీటర్లు పని చేస్తున్నాయా? లేదా? తదితర అంశాలపై వివరాలడిగారు. ధాన్యం సేకరణ కార్యకలాపాల్లో తగినంత సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయలని డ్వామా పీడీని ఆదేశించారు. సాంకేతిక సహాయకుడు, డీఏలు తగినంత మొత్తంలో ఏర్పాటు చేయాలని బిజినెస్ మేనేజర్, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ధాన్యం సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమాండ్ కంట్రోల్ రూం పిపిసి, రైతు భరోసా కేంద్రంలో విఎఎలకు వివరించారు. సమీక్షలో సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి, జిల్లా అధికారి జి.మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాల్, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ నాగశ్రీనివాస్ పాల్గొన్నారు.

చిర్రావూరులో ఎడ్ల పందేలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ధనేకుల అప్పారావు, అనసూయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిర్రావూరులో ఒంగోలు జాతి, వృషభ రాజముల ఎడ్ల పందేలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హజరైన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయానికి ఉపయోగపడే పశుపోషణ ప్రస్తుత రోజుల్లో చాలా ఖర్చుతో కూడుకున్నదని చెప్పారు. ఈ క్రమంలో రైతులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయుక్తమని చెప్పారు. ఇదిలా ఉండగా మూడ్రోజులపాటు నిర్వహించే పోటీలను చూడ్డానికి పశుపోషకులు, రైతులు, సమీప ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివాచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పోటీల నిర్వాహకులు ధనేకుల నరసింహారావు (బాబు), వైసిపి చేనేత విభాగం రాష్ట్ర నాయకులు గంజి చిరంజీవి, సొసైటీ మాజీ అధ్యక్షులు మేకల సాంబశివరావు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కౌలురైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభ చిత్రమాలిక

అమరుల స్తూపం వద్ద విజూకృష్ణన్ నివాళి

ప్రారంభ సభలో మాట్లాడుతున్న మానుకొండ ఉపేంద్ర, వి.వెంకటేశ్వర్లు, ముజఫర్ అహ్మద్, ఎం.హరిబాబు

ధాన్యం కొనుగోలుపై తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న ఎం రాజశేఖర్, బలపరుస్తున్న బి.శ్రీనివాసరావు

అమరుల స్తూపం వద్ద వి.శ్రీనివాసరావు నివాళి

సంఘం జెండా ఆవిష్కరణ

ప్రారంభ సభలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ర్యాలీ ప్రారంభానికి ముందు డప్పుల మోత..

ప్రతినిధుల నమోదు

విజూకృష్ణన్, లక్ష్మణరావు మాటామంతి..

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు కె రామారావు

ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న విజూకృష్ణన్

తీర్మానానికి ఆమోదం తెలుపుతున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట, పల్నాడు జిల్లా

ప్రజానాట్య మండలి కళాకారుల గేయాలాపన